క్లుప్తంగా

ముగిసిన దశమి ఉత్సవాలు



నల్లారెడ్డి స్వామి పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని తంగరడోణలో వెలసిన చింతలముని, నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. స్వాముల ఆలయాల్లో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి సమీపంలోని నల్లారెడ్డి ఆలయం వద్ద వున్న రాక్షస పడవ వద్ద జంతువులను బలిదానం చేసి ఉత్సవాలను ముగించారు. ఆలయ ధర్మకర్త పార్వతి, సర్పంచ్ శంకరమ్మ, గ్రామ పెద్దలు సీతారామి రెడ్డి, గోపాల్ రెడ్డి, వెంకన్న, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి మార్కెట్ వేలం వాయిదా

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయితీ కూరగాయల మార్కెట్ వేలం ఈనెల 30వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఈఓ రామాంజనేయులు ప్రకటించారు. సోమవారం ఆస్పరి పంచాయతీ కార్యాలయం అవరణలో సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో 2023–24కు సంబంధించి కూరగాయల మార్కెట్ వేలంపాట కార్యక్రమం ఈఓ నిర్వహించారు. ఐదుగురు పాటదారులు రూ.2 లక్షలు డిపాజిట్ చెల్లించి వేలంపాటకు సిద్ధమయ్యారు. ఈ స్థితిలో గతేడాది నిర్వహించిన వేలంలో గ్రామాభివృద్ధి కోసం కేటాయించిన సుమారు రూ.29 లక్షలకు సంబంధించి లెక్కలు చెప్పాలని గ్రామస్తులు పట్టుబట్టారు.లెక్క చెప్పే వరకు వేలం నిర్వహించవద్దన్నారు.దీంతో ఈఓ వేలంను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఉప సర్పంచ్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు. ఇన్‌చార్జ్ ఎస్ఐ నాగేంద్ర బందోబస్తు నిర్వహించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో పరిధిలోని బస్సు సర్వీసులపై సందేహాలను నివృత్తి చేసి సమస్యలను పరిష్కరించేందుకుగాను మంగళవారం ప్రయాణికులతో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఎం అమర్నాథ్ సోమవారం తెలిపారు.ప్రయాణికులు సెల్ నెంబర్ 9959225796 కు సంప్రదించాలని సూచించారు.

ఈ–క్రాప్ నమోదు పరిశీలన



ఈ క్రాప్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ సునీత

హాలహర్వి: ప్రతిరైతు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఆలూరు ఏడీఏ సునీత సూచించారు. ఈ మేరకు సోమవారం వ్యవసాయ సిబ్బంది హాలహర్విలో రైతు రామకృష్ణ పొలంలో ఈ క్రాప్ నమోదు చేస్తుండగా ఆమె పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ–క్రాప్ నమోదు వల్ల సబ్సిడీలు, రైతు భరోసా సాయం, ఇన్సూరెన్స్ ఇతర పథకాలు వర్తిస్తాయన్నారు. ఏఓ శివశంకర్, వీఏఏ ఇంద్రజ, తలారి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

30న గరుడ సేవ

మద్దికెర: మండలంలోని పెరవలి గ్రామంలో ఈ నెల 30వ తేదీ పౌర్ణమి సందర్భంగా శ్రీరంగనాథ స్వామి వారి గరుడసేవతో పాటు పల్లకీ ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

ఏడు వేల ఎకరాల్లో పంట నమోదు

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు ఏడు వేల ఎకరాల్లో పంట నమోదు పూర్తి చేసినట్లు ఏఓ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. పంట నమోదులో అవకతవకలు జగరకుండా జాగ్రత్తలు పాటిస్తున్నామన్నారు. రైతులు కూడా అధికారులకు సహకరించాలని కోరారు.

తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం

ఆలూరు: తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న పది గ్రామాలకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య పేర్కొన్నారు. హాలహర్వి మండలం చింతకుంట, బాపురం గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకుల దిగువ కాలువ నుంచి పంపింగ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక డీఈ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆలూరు ఆర్‌డబ్ల్యూఎస్ సబ్‌డివిజన్‌కు సంబంధించి తాగునీటి సమస్య ఉన్న గ్రామాల దాహార్తి తీర్చేందుకు రూ.2 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం టెండర్లు పూర్తయినట్లు చెప్పారు. వచ్చే నెలాఖరుకల్లా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

కొత్త పింఛన్లు మంజూరు

- మండలంలో 153 మంది అర్హులు గుర్తింపు
- కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన
- ప్రతి నెలా 5,945 మందికి రూ.1.64 కోట్ల నగదు పంపిణీ



కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫాతీమాకు పింఛన్ అందించేందుకు బయోమెట్రిక్ నమోదు చేస్తున్న వలంటీర్ హుసేన్ (ఫైల్)

ఆలూరు రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక కింద అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. పింఛన్ల కోసం లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి వద్దనే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ల మంజూరులో తీసుకొచ్చిన నూతన మార్పులతో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా కొత్త పింఛన్లు పొందుతున్నారు. మండలవ్యాప్తంగా గడిచిన నాలుగేళ్ల కాలంలో 5,945 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసింది. వచ్చే నెల 1 నుంచి మరో 153 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులకు పింఛన్ల నగదు అందజేయనుంది. మొత్తంగా మండలంలో 6,098 మందికి పింఛన్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ప్రతి నెలా లబ్ధిదారులకు రూ.1,63,94,250 పంపిణీ చేస్తున్నారు. ఈ నెల నుంచి రూ.4.22 లక్షల నగదు పెరగనుంది. గ్రామాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియను చేపట్టారు. లబ్ధిదారుల ఎంపికలో అవినీతి అక్రమాలు, పక్షపాత ధోరణి, రాజకీయాలకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

గత టీడీపీ పాలనలో అవస్థలు

గత టీడీపీ పాలనలో పింఛన్ నగదు కోసం లబ్ధిదారులు కార్యాలయం వద్ద పడిగాపులు కాసేవారు. కొత్త పింఛన్ల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. జన్మభూమి కమిటీలు సంతకం పెట్టకపోతే కొత్త పింఛన్లు మంజూరు చేసే అధికారం ఉన్నతాధికారులకు ఉండేది కాదు. ప్రతి నెలా నగదు సైతం 4, 5 తేదీల నుంచి పంపిణీ చేసేవారు. పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల వద్దకు లబ్ధిదారులు వెళ్లి గంటల తరబడి వేచి ఉంటే నగదు అందించేవారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి నెలా 1వ తేదీ నుంచి ఇంటి వద్దే పింఛన్లు మంజూరు చేస్తుంది. లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడకు వలంటీర్లు వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఈ సౌకర్యం ఉంది. కొన్ని రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి నెలకు రూ.5 వేల నుంచి రూ. 10 వేల వరకు పింఛన్లు అందిస్తున్నారు.

కొత్త పింఛన్ల పరిశీలన పూర్తి



మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో 153 నూతన పింఛన్ దరఖాస్తులను పరిశీలించి అర్హుల విచారణ ప్రక్రియ పూర్తి చేశాం. వచ్చే నెల నుంచి ప్రభుత్వం వారికి నగదు విడుదల చేస్తుంది. వెంటనే వలంటీర్ల ద్వారా పింఛన్ సొమ్ము అందిస్తాం. ఇప్పటివరకు మండలంలో 5,945 మందికి రూ.1.64 కోట్ల నగదు పంపిణీ చేస్తున్నాం. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతున్నాం.

– అల్లబకష్, ఎంపీడీఓ, ఆలూరు

రేపు అర్బన్ హెల్త్ సెంటర్ల ప్రారంభోత్సవం



పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ఆరోగ్య కేంద్రం

ఎమ్మిగనూరుటౌన్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎమ్మిగనూరులో కొత్తగా నిర్మించిన రెండు డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల నూతన భవన సముదాయాలను బుధవారం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ప్రారంభించనున్నారు. పట్టణంలోని శిల్పా ఎస్టేట్, శివన్న నగర్‌లో రూ.1.60 కోట్లతో నిర్మించిన రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల ప్రారంభోత్సవ ఏర్పాట్లను ముమ్మరం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ రెండు భవనాలు ప్రారంభమైతే స్థానిక ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

వంద శాతం జీఈఆర్ సాధించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: బడిఈడు పిల్లలంతా పాఠశాలల్లోనే ఉండేలా సత్వర చర్యలు తీసుకొని వంద శాతం జీఈఆర్ (గ్రాస్ ఎన్రోల్‌మెంట్ రేషియో) సాధించేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలతో జీఈఆర్‌పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలో బడి బయట ఉన్న పిల్లలను వార్డు సచివాలయాల వారీగా గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఇందుకు విద్యాశాఖ పూర్తిగా సహకరించాలని కోరారు. శాశ్వత వలస వెళ్లిన వారి పిల్లలైతే ఎంఈఓల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 31వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈఓ మధుసూదన్‌రాజు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

షాపుల అద్దె బకాయి వసూలు: మున్సిపాలిటీ పరిధిలోని జి బ్లాక్‌లో ఉన్న షాపు నంబర్లు 6, 11 లీజుదారులు బకాయిపడ్డ అద్దెను కమిషనర్ ఆదేశాల మేరకు రూ.1,06,000 లను మున్సిపల్ రెవెన్యూ, వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు రహంతుల్లా, పవన్, లీలాజ్యోతి వసూలు చేశారు.

భక్తితో పులకించిన టి.గోకులపాడు



శివాలయం ముందు ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న గ్రామస్తులు

కృష్ణగిరి: విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలతో టి.గోకులపాడు గ్రామం పులకించింది. సోమవారం ఉదయం నవగ్రహాలను ప్రతిష్టించి అనంతరం ఊరువాకిలిని ప్రారంభించారు. 11 గంటలకు చెన్నకేశవ స్వామి, పార్వతి పరమేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి దేవాలయాల ముందు క్రేన్ సాయంతో ధ్వజస్తంభాలను పురోహితుల ఆధ్వర్యంలో ప్రతిష్టించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఈ మూడు దేవాలయాల వద్ద ధ్వజస్తంభాలను దాతలు ఉప్పరి భీమలింగడు, తెలుగు నాగరాజు, తెలుగు మల్లేష్, కొంగనపాడు నాగయ్య, కర్నూలుకు చెందిన వారు అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

మసీదుపురంలో పోటెత్తిన భక్తులు



స్వామి వారికి నైవేద్యం తయారు చేస్తున్న భక్తులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రావణమాసం రెండవ సోమవారం కావడంతో భక్తులు పోటెత్తారు. ఏటా శ్రావణ మాసంలో ఈ దేవాలయంలో నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నరసింహ స్వామిని దర్శించుకొవడానికి రాష్ట్రం నుంచే గాక కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

నందవరం: 'స్పందన' అర్జీలను సత్వర పరిష్కారం చూపాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సృజన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల అధికారులు హాజరయ్యారు. అనంతరం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భవన నిర్మాణాల్లో పురోగతి సాధించాలని పీఆర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. అలాగే ఆయా గ్రామ సచివాలయాల్లో స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించేలా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. మండల విద్యాధికారులు సుదర్శన్‌రెడ్డి, సీహెచ్ఓ బలరాం, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, హౌసింగ్ ఏఈ గురుస్వామి, ఏపీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంకు తనిఖీ



ఖాతాదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అమరావతి జోనల్ మేనేజర్ సూర్యనారాయణమూర్తి

హాలహర్వి: మండలకేంద్రంలోని ఇండియన్ బ్యాంకును సోమవారం అమరావతి జోనల్ మేనేజర్ సూర్యనారాయణమూర్తి తనిఖీ చేశారు. బ్యాంకులో రైతులతో సమావేశమయ్యారు. రైతులకు తక్కువ వడ్డీకే బంగారు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఖాతాదారులు బ్యాంకుల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. బ్యాంకుకు సంబంధించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అన్ని లావాదేవీలు, వాటి వివరాలను యాప్ ద్వారా చేసుకోవచ్చన్నారు. ఈయన వెంట బ్రాంచ్ మేనేజర్ రాజ్ గుండప్ప, అసిస్టెంట్ మేనేజర్లు చంద్రశేఖర్, కౌజూర్, బ్రాంచ్ ఆర్‌డీఓ కోమల్, క్లర్క్ చిన్ను, దేవదాసురాథోడ్ ఉన్నారు.

గోనేహాల్ రోడ్డుకు మహర్దశ



నాడు - కంకర తేలిన గోనేహాల్ రోడ్డు (ఫైల్)



నేడు - రాకపోకలకు అనువుగా మారిన తారు రోడ్డు

ఆలూరు రూరల్: ఏన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉన్న గోనేహాల్ రోడ్డుకు మహర్దశ వచ్చింది. గతంలో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. గ్రామస్తుల వినతి మేరకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో ఏషియన్ బ్యాంకు నిధులు రూ.74 లక్షలు మంజూరు చేయించారు. హైవే 167 నుంచి గోనేహాల్ గ్రామానికి 1.4 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులు సోమవారం ఉదయం ప్రారంభించి సాయంత్రంలోపు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తిచేసినట్లు పీఐయూ (ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్) డీఈ భాస్కర్ వెల్లడించారు. ఒక్కరోజులోనే గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం జరిగి 30 ఏళ్ల కల సాకారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మల్లికార్జున రెడ్డి, వీరభద్రా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వీరభద్రి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పథకాలతో పేదలందరికీ లబ్ధి



రాతనలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో పేదలందరికీ లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం రాతనలో వైఎస్సార్‌సీపీ నాయకులు విజయమోహన్ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, సర్పంచ్ రాచప్ప, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి, మండల కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషాతో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఇంటింటికీ వెళ్లి ఏ పథకం ద్వారా ఎంత మొత్తంలో నగదు అందిందో కరపత్రాల ద్వారా వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాడు–నేడు కింద జెడ్పీ పాఠశాల తరగతి గదులకు మంజూరైన నిధులు గతంలో ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారని వాటిని తిరిగి మంజూరు చేసేలా చూడాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు విన్నవించారు. స్థానికులు తీసుకొచ్చిన పలు సమస్యలను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రానున్న రోజుల్లో వెన్నుదన్నుగా నిలిచి తిరిగి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రా రెడ్డి, జగన్నాథ రెడ్డి, నాగేష, మోహన్‌రెడ్డి, టీఎండీ హుసేన్, మల్లికార్జున రెడ్డి, నాగప్ప, గోపాల్‌రెడ్డి, నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సౌకర్యం కోసం రూ.కోటి మంజూరు

మద్దికెర:మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం రూ.1.08 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ సోమవారం తెలిపారు.మద్దికెరలో గుంతకల్లు రహదారిలోని జగన న్న కాలనీలో 60 వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం,ఇంటింటికీ కుళాయి వేసేందుకు రూ.49, 38,000, అలాగే పెరవలి గ్రామంలోని జగనన్న కా లనీలో ఇంటింటికీ కొళాయి, బీసీ కాలనీలో నీటి సమస్య పరిష్కరించేందుకు 40 వేల లీటర్ల ఓవర్‌హెడ్‌ట్యాంకు నిర్మాణం కొరకు రూ.50,70,000 మంజూరు చేసిందన్నారు. త్వరలోనే పనులు ప్రార ంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రోడ్లపై చెత్తను వేయొద్దు

మద్దికెర: గ్రామాల్లో ప్రజలు, దుకాణదారులు ఇష్టానుసారంగా చెత్త, ప్లాస్టిక్ కవర్లను రోడ్డుపై వేయవద్దని స్వచ్ఛభారత్ కార్మికులు వచ్చినపుడు వారికి అందించాలని ఈఓ శ్రీహరి సూచించారు. సోమవా రం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'ప్లాస్టిక్ కవర్లే పశువులకు ఆహారం' అనే వార్తకు స్పందించిన పంచాయతీ అధికారులు స్థానిక ప్రధాన బజారులోని దుకాణాల యజమానులకు, ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నిర్లక్ష్యంగా రోడ్డుపై చెత్త వేస్తే పంచాయతీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ చెత్తను కుండీలలో వేసి చెత్త తరలించే వాహనాలు వచ్చినప్పుడు అందించాలని సూచించారు.

ఐదు రోజుల ఉత్సవాలకు అనుమతించాలి

పత్తికొండ రూరల్: పత్తికొండలో వినాయక చవితి ఉత్సవాలను 5 రోజుల పాటు నిర్వహించుకునేందుకు అనుమతించాలని వివిధ అసోషియేషన్ల వినాయక ఉత్సవ సమితి సభ్యులు సోమవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి వినతి పత్రం అందజేశా రు. కేవలం రెండు రోజుల పూజల అనంతరం వినా యక విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల లక్షలా ది రూపాయలు వెచ్చించి నిర్మించిన భారీ మండపా లు, విగ్రహాల ఖర్చు వృథా అయిపోతుందన్నారు. ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవడానికి గడువు పెంచేలా చూడాలని కోరారు. అధికారులతో మాట్లాడి ఉత్సవ గడువు పెంచేలా చూస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

నేడు మండల మీట్

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ సోమవారం విలేకరులకు తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జరగాల్సిన పనులతో పాటు అజెండాలోని అంశాల గురించి చర్చిస్తామన్నారు.

నందవరం: మండల సర్వసభ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఎంపీపీ లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన సమావేశం ఉంటుందని ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

బషీర్‌బాగ్ అమరులకు నివాళి

ఎమ్మిగనూరుటౌన్: 2000 సంవత్సరంలో టీడీపీ పాలనలో విద్యుత్ చార్జీల పెంపుపై హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరిగిన ఉద్యమంలో అమరులైన వారి చిత్రపటాలకు సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఐ ఎంఎల్ నాయకులు రాజు, సంజీవ, నరసింహులు, ఐఎఫ్‌టీయూ నాయకులు సత్యన్న, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పొట్టేళ్ల దొంగలకు దేహశుద్ధి

గోనెగండ్ల: మండల పరిధిలోని ఎన్నెకండ్ల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి పొట్టేళ్లను అపహరించేందుకు వచ్చిన దుండగులను కాపరులు, గ్రామస్తులు పట్టుకున్నారు. ముగ్గురు దుండగులను కరెంట్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ తిమ్మారెడ్డి, సిబ్బంది వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం గ్రామంలో బోయ బజారి, కుమ్మరి బజారికి చెందిన నాలుగు పొట్టేళ్లను అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించడంతో అప్పటినుంచి గొర్రెల మంద దగ్గర నిఘా పెట్టామన్నారు. ఆదివారం అర్ధరాత్రి కడివెళ్ల గ్రామానికి చెందిన ఆరుగురు రెండు బైక్‌లపై వచ్చి ఎన్నెకండ్ల గ్రామ శివారులో మంద నుంచి పొట్టేళ్లను ఎత్తుకెళుతుండగా జీవాలు అరవడంతో కాపరులు లేచి పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు పరారయ్యారు. విషయం గ్రామస్తులకు తెలియడంతో గ్రామంలో గాలించి నిందితులు చంద్ర, శ్రీనివాసులు, కౌలుట్లను పట్టుకున్నారు. మరో ముగ్గురు పారిపోయారు. పట్టుబడిన వారికి దేహశుద్ధి చేయగా వారం రోజుల క్రితం నాలుగు పొట్టేళ్లను ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. పరారైన ముగ్గురిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు



గాయపడిన తిమ్మప్ప

హొళగుంద: మండల పరిధిలోని పెద్దగోనెహాళ్ గ్రామ సమీపంలో ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఉప్పరి తిమ్మప్ప అనే యువకుడు బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. పని నిమిత్తం హెబ్బటం గ్రామానికి వచ్చిన తిమ్మప్ప తిరిగి పెద్దహరివాణంకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తిమ్మప్ప తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా అక్కడ పొలంలో పని చేస్తున్న కూలీలు సపర్యాలు చేశారు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు.

వెల్దుర్తి సీఐ బదిలీ



బదిలీపై వెళ్లిన సీఐ యుగంధర్

వెల్దుర్తి: వెల్దుర్తి సీఐ పి.యుగంధర్ కడప జిల్లా బద్వేలు పట్టణానికి బదిలీ అయ్యారు. ఆయన సోమవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. వెల్దుర్తి, కృష్ణగిరి ఎస్ఐలు, సిబ్బంది ఆయనకు వీడ్కోలు పలికారు. గతేడాది జూన్ 23న వెల్దుర్తి సీఐగా బాధ్యతలు స్వీకరించిన యుగంధర్ శాంతి భద్రతల పరిరక్షణలో, లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం దిశగా ఇరువర్గాలకు రాజీ కుదర్చడంలో, ప్రజలు మోసాల బారిన పడకుండా అవగాహన కల్పించడంలో చురుగ్గా పనిచేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శిథిలావస్థకు చేరుకున్న నాగులకట్టను నూతనంగా నిర్మించి అభివృద్ధి చేశారు.పలు సేవా కార్యక్రమాలతో మంచి గుర్తింపు పొందారు. ఆయన స్థానంలో హైదరాబాద్ జనరల్ ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న సురేశ్‌కుమార్ రెడ్డి నియామకం కాగా త్వరలో బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

పౌష్టికాహారం తీసుకోవాలి



ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మద్దికెర: చిన్నారులు ఇష్టానుసారంగా బయటి పదార్థాలు తినకుండా ఇంట్లో లభించే పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ తెలిపారు. సోమవారం స్థానిక సెంట్రల్ పాఠశాలలో రక్తహీనత, పరిశుభ్రత అనే అంశంపై అవగాహన కల్పించడమే గాకుండా హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థులు చేతులను శుభ్రం చేసుకున్న తర్వాత భోజనం చేయాలన్నారు. విటమిన్–సి ఎక్కువగా ఉన్న పదార్థాలను తీసుకోవాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, సిబ్బంది ప్రకాష్‌రావు, కృష్ణమ్మ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పత్తికొండ రూరల్: స్థానిక శ్రీహర్ష పాఠశాలలో సోమవారం పోచిమిరెడ్డి సేవాదళ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సతీమణి భారతి దంపతుల వివాహ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీలు దేవరగట్టు లక్ష్మి, అనిత, సరోజ, వార్డు మెంబర్లు బోదా సావిత్రి, నాగరాజు, మాజీ ఎంపీటీసీ గణపతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శిఖర కలశ ప్రతిష్ట

దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామంలో వెలిసిన శ్రీ రామలింగేశ్వర స్వామి, ఓబులేష్ స్వామి ఆలయాల గోపుర శిఖర ప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో గత మూడు రోజుల నుంచి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్తూరు పీఠాధిపతి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓబులేష్ స్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కళ్యాణం జరిపించారు. అనంతరం విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బొడ్రాయికి పూజలు

మద్దికెర: మండల కేంద్రంలోని మద్దమాంబ దేవాలయంలో అమ్మవారి పాదాలకు, బొడ్రాయికి సోమవారం పూజలు నిర్వహించారు. యువకులు ఉపవాసదీక్ష చేపట్టి 101 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.